## హుస్నాబాద్ నుంచి నూతన ఆర్టీసీ సర్వీసులు ప్రారంభం...



హుస్నాబాద్,జనత న్యూస్ : హుస్నాబాద్ డిపో నుంచి భద్రాచలం, బాసర, ఆదిలాబాద్ ప్రాంతాలకు కొత్తగా మంజూరైన ఆర్టీసీ బస్సు సర్వీసులను మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, డిపో మేనేజర్ వెంకన్నతో కలిసి సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నూతన సర్వీసులను అందుబాటులోకి తెచ్చినట్లు వారు పేర్కొన్నారు.బస్సులను ప్రారంభించిన అనంతరం మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలిసి చైర్‌పర్సన్ బస్సులో టికెట్ తీసుకుని కొద్దిదూరం ప్రయాణించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ వెంకన్న మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక క్షేత్రాలైన భద్రాచలం, బాసరతో పాటు ఆదిలాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు ఈ సర్వీసులు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు.ముఖ్యంగా ఆదిలాబాద్‌కు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు షిఫ్టుల్లో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుస్తాయని వివరించారు. ఈ సదుపాయాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు ఆకుల రజిత, గోపగోని శోభన్, వైద్యం కిరణ్, కొండ రజిత, బూరుగు లత, కేశవేని రమేష్, పిల్లి తిరుపతి, చెన్నబోయిన అనూష, బత్తుల స్వరూప, పూదరి వరప్రసాద్, ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విలువ ఆధారిత ఉత్పత్తులతోనే మత్స్యకారుల ఆదాయం రెట్టింపు



చిగురుమామిడి,జనత న్యూస్: చేపల పెంపకంతో పాటు కోత అనంతర సాంకేతికతను అందిపుచ్చుకొని, విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడం ద్వారానే మత్స్యకారుల ఆదాయం రెట్టింపు అవుతుందని విశాఖపట్నం సి.ఐ.ఎఫ్.టి శాస్త్రవేత్త ఎం.వి. రావు పేర్కొన్నారు. నాబార్డ్ సౌజన్యంతో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి ఫిషరీస్ ఎఫ్.పి.ఓ సభ్యులకు, మ్యాక్స్ సొసైటీ మత్స్యకార మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కాకినాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్-స్టేట్ ఎక్స్‌పోజర్ కార్యక్రమం ద్వారా మత్స్యకారులకు శిక్షణ, అవగాహన కల్పించారు.చేపలను కేవలం పచ్చిగా విక్రయించడమే కాకుండా, ఆధునిక పద్ధతుల్లో క్లీనింగ్, గ్రేడింగ్, బ్రాండింగ్ చేసి ఫిష్ ఫుడ్ అవుట్‌లెట్ల ద్వారా మార్కెటింగ్ చేయాలని, ఆన్‌లైన్ విక్రయాలు, ఎగుమతులపై దృష్టి సారించడం ద్వారా ఎఫ్.పి.ఓలు అధిక లాభాలను ఆర్జించవచ్చని శాస్త్రవేత్తలు వివరించారు.

స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ అడిషనల్ డైరెక్టర్ అంజలి మాట్లాడుతూ ఆక్వా సాగు చేసే రైతులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.శాస్త్రీయ యజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్లు సురేష్, జాస్మిన్, జనవికాస సంస్థ కార్యదర్శి, ఫీల్డ్ మేనేజర్ నాగేంద్ర, కోఆర్డినేటర్లు రాజు, సోమేశ్వర్లు,గందె సంపత్, 25 మంది ఎఫ్.పి.ఓ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



రాజన్న సిరిసిల్ల, జనతా న్యూస్, ఫిబ్రవరి 23: ఈ నెల 25 నుంచి వచ్చే నెల మార్చి 16 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలో మొత్తం 16 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసి అన్ని అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఈసారి పరీక్షలకు 8,106 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అందులో ఫస్ట్ ఇయర్‌కు 4,046 మంది, సెకండ్ ఇయర్‌కు 4,060 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. విద్యార్థులు పరీక్షా సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. ప్రభుత్వం నూతనంగా చేసిన మార్పుల ప్రకారం నిర్ణీత సమయం 9 గంటల తర్వాత ఐదు నిమిషాల లోపు చేరుకున్న విద్యార్థులకు అనుమతి ఉంటుంది. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లో పూర్తిగా నిషేధం. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, కోనరావుపేట, ఇల్లంతకుంట, చందుర్తి, రుద్రంగి, గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట్ తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. ప్రశ్నాపత్రాల మూడు సెట్లను పోలీస్ స్టేషన్లకు భద్రపరిచారు. పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్షా సమయాల్లో జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని అధికారులు ఆదేశించారు. విద్యార్థులు హాల్ టికెట్లను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, అవి ు+దీ×జు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సుమారు 350 నుంచి 400 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని, పరీక్షలు సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఆమె తెలిపారు.

# గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేయడంపై ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



కరీంనగర్, జనతా న్యూస్: గౌరెల్లి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యత క్రమంలో నిర్మించాల్సిన ప్రాజెక్టులలో గౌరెల్లి ప్రాజెక్టు ముఖ్యమైనదని ఆయన తెలిపారు. లక్షా 6 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన చిక్కుల కారణంగా ఆలస్యమైందన్నారు. అయితే ప్రస్తుతం ఆ అవరోధాలను అధిగమించి పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి గౌరెల్లి ప్రాజెక్టు పురోగతిపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్య దాస్ నాథ్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్‌డఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, ఇఎన్‌సీ జనరల్ రమేష్ బాబు, కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. వరద కాలువ ద్వారా వచ్చే నీటితో సిద్దిపేట జిల్లా అక్కనపేట మండలంలోని గౌరెల్లి గ్రామంలో మొదట 1.41 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం ప్రతిపాదించగా, సవరించిన అంచనాల ప్రకారం దాన్ని 8.23 టీఎంసీలకు పెంచి అదనపు ఆయకట్టును సేద్యంలోకి తేవాలని ప్రభుత్వం సంకల్పించిందని మంత్రి తెలిపారు. భూసేకరణ విషయంలో రైతులకు న్యాయబద్ధమైన చెల్లింపులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అవసరమైన నిధులను జూన్ 2కి ముందే విడుదల చేస్తామని చెప్పారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లకు ఆదేశించారు. గౌరెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన న్యాయపరమైన కేసు త్వరలో విచారణకు రానున్న నేపథ్యంలో, అన్ని న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు వ్యూహంతో ముందుకు సాగాలని అడ్వకేట్ జనరల్‌కు సూచించినట్లు తెలిపారు. పలు అవరోధాలతో నిలిచిపోయిన ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేయడంపై నిరంతరం దృష్టి సారిస్తున్నామని, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దేవాదుల, గౌరెల్లి సహా నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో భూముల ధరలు అధికమవడంతో రైతులు ఎక్కువ నష్టపరిహారం కోరుతున్నారని, అందుకు తగిన న్యాయపరమైన నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

## నిబంధనలకు విరుద్ధ నంబర్ ప్లేట్లపై పోలీసుల కొరడా

**43 వాహనాలు సీజ్**




కరీంనగర్, జనతా న్యూస్: నగరంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాల నంబర్ ప్లేట్లపై కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 43 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ కార్నర్ వద్ద ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీం ఉల్లా ఖాన్ ఆధ్వర్యంలో ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. తనిఖీల్లో భాగంగా నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లు, అస్పష్టంగా ఉన్న లేదా ట్యాంపరింగ్ చేసిన నంబర్ ప్లేట్లు కలిగిన వాహనాలపై చర్యలు తీసుకున్నారు. మొత్తం 43 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని యజమానులపై జరిమానాలు విధించారు. సరైన నంబర్ ప్లేట్లు బిగించిన తరువాత మాత్రమే వాహనాలను విడుదల చేస్తామని ట్రాఫిక్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీం ఉల్లా ఖాన్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్పష్టమైన నంబర్ ప్లేట్లు కలిగి ఉండాలని సూచించారు. నంబర్ ప్లేట్లను మార్చడం, అస్పష్టంగా ఉంచడం చట్టరీత్యా నేరమని, నేరాల నియంత్రణలో నంబర్ ప్లేట్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో సెక్షన్ 163 అమలు



సిద్దిపేట, జనతా న్యూస్: సిద్దిపేట జిల్లాలో నిర్వవిాంచనున్న ఇంటర్మీడియట్ ప్రజా పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ (అదనపు జిల్లా మేజిస్ట్రేట్) తెలిపారు. ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు జిల్లాలోని మొత్తం 42 పరీక్షా కేంద్రాల పరిధిలో సెక్షన్ 163 అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని, పరీక్షా కేంద్రాల నుండి 200 మీటర్ల పరిధిలో ప్రజలు గుమికూడరాదని ఆదేశించారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రత్యేక గస్తీ నిర్వహిస్తారని చెప్పారు. విద్యార్థులు పరీక్షా సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని, ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కమిషనర్ సూచించారు. ఈ మేరకు కమిషనర్ కార్యాలయం నుండి ప్రకటన జారీ చేయబడింది.

# మొగిలిపాలెంలో నిధుల దుర్వినియోగం...?

**సమావేశంలో ప్రశ్నించిన సర్పంచ్**

**విచారణ చేపడతామన్న అధికారులు**



తిమ్మాపూర్, జనతా న్యూస్ : మండలంలోని మొగిలిపాలెం గ్రామ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగమైనట్లు సర్పంచ్ తాట్ల తిరుపతి ఎంపీడీవో కార్యాలయంలో ప్రశ్నించారు. తిమ్మాపూర్ మండలంలోని అన్నీ గ్రామాల సర్పంచులతో ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశాన్ని మండల ప్రత్యేక అధికారి శ్రీధర్ అధ్యక్షతన ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారిగా అధికారులు వివరాలను తెలిపారు. మొగిలిపాలెంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4లక్షలు తమకు తెలియకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శి వాటిని వివిధ అకౌంట్లలోకి జమ చేసారని సర్పంచ్ తాట్ల తిరుపతి సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై డీపీవోకి ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు విచారణ చేపట్టలేదని, అలాంటపుడు తాము గెలిచి ఏం లాభమని, ఇలాంటి మోసాలను అరికట్టలేరా అంటూ సర్పంచ్ ప్రశ్నించారు. దీనిపై తాము విచారణ చేపడతామని, బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి శ్రీధర్, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా, ఎంపీవో శ్రీనివాస్ హామీచ్చారు.

**ఉపాధి హామీ ని సద్వినియోగం చేసుకొండి...**

గ్రామంలో ఉపాధి హామీ నిధులను ప్రజాప్రతినిధులు సద్వినియోగ చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి శ్రీధర్, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా సూచించారు. గ్రామంలో ఉపాధి హామీ పనులకు కూలీలు అధికంగా హాజరయ్యేలా చూడాలని వారు సర్పంచులను కోరారు. కూలీల సంఖ్య పెంచితేనే ఉపాధి హామీ నిధులు అత్యధికంగా వస్తాయని తెలిపారు. ప్రతీ గ్రామంలో ప్రతీ రోజు ఉపాధి కూలీలు ఎక్కువ సంఖ్యలో వచ్చేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద నిధులు వచ్చాయని, వెంటనే వాటి తీర్మాణాలు అందజేసి మంజూరి చేయించుకుని పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులున్నా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలని, అధికారులు సైతం స్పందిస్తూ సర్పంచులకు అందుబాటులో ఉంటూ పరిష్కారం చేస్తూ గ్రామాల అభివృద్ధికి సహకరించాలని వారు సూచించారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని తెలిపారు. మంగళవారం నుండి ఐదు రోజుల పాటు జరిగే సర్పంచుల శిక్షణ కార్యక్రామాలకు సర్పంచులు తప్పకుండా హాజరై అన్నీ విషయాలపై అవగాహాన పెంచుకుంటే రానున్న ఐదేళ్లలో సమర్థవంతమైన పాలనను అందించవచ్చని సూచించారు.

**సర్పంచులకు సన్మానం...**

తిమ్మాపూర్ మండలంలోని 23 గ్రామాలకు సంబంధించిన సర్పంచులతో ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించి సర్పంచులకు

ఎంపీడీవో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి హాజరైన సర్పంచులను అధికారులు సన్మానించారు. అనంతరం ప్రత్యేక అధికారిని, ఎంపీడీవోను సర్పంచులు సన్మానించి బోకెలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీధర్, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, ఎంపీవో శ్రీనివాస్, తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎంఈవో శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి సురేందర్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షురాలు పొన్నం సునీత, సర్పంచులు గంకిడి లక్ష్మారెడ్డి, ఎలుక అంజనేయులు, బిల్లా సంతోష్ కుమార్,

పొన్నాల సంపత్, ఆశోద శ్రీనివాస్, తాట్ల తిరుపతి, అవుదుర్తి రామకిషన్, మామిడి మమత, పెరుక రవి, నీలం చంద్రారెడ్డి, గుంటి లావణ్య, సూరం స్వప్న, దుర్గం శ్రీనివాస్, గుజ్జుల శ్వేత, గోదరి శోభారాణి, కనకం లక్ష్మి, పిసుక సౌజన్య, మల్లెత్తుల స్వరూప, ఇంజినీర్లు, ఇతర శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# వేసవిలో త్రాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు

## మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, జనతా న్యూస్: వేసవి కాలంలో నగర ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపడుతోందని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నగరంలోని మానేరు డ్యాం సమీపంలోని నీటి శుద్ధికరణ కేంద్రాన్ని మేయర్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా 14, 34, 35 ఎంఎల్‌డీ పంప్ హౌస్‌లు, మోటార్ పంపుల పనితీరు, నీటి శుద్ధికరణ ప్రక్రియను పరిశీలించారు. వాల్వ్ లీకేజీలు, మోటార్ పంపుల మరమ్మతులు వంటి అంశాలను అధికారులు మేయర్ దృష్టికి తీసుకురాగా, వాటిని వెంటనే పరిష్కరించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. నీటి శుద్ధికరణ ప్రక్రియను పర్యవేక్షిస్తూ ఫిల్టర్ బెడ్‌లలో సరైన క్లోరినేషన్ చేపట్టి సురక్షితమైన నీటిని సరఫరా చేయాలని సూచించారు. హై లెవల్ రిజర్వాయర్‌ను కూడా సందర్శించిన మేయర్, సంప్ మరియు మోటార్ పంపులను తనిఖీ చేశారు. హై లెవల్, లో లెవల్ నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నగరంతో పాటు విలీన గ్రామాల డివిజన్ల ప్రజలకు ప్రతిరోజు త్రాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎజమానేరు డ్యాం నీటి మట్టం 7 టీఎంసీలకు చేరుకున్న నేపథ్యంలో అదే నీటి సామర్థ్యాన్ని కొనసాగించేలా ఇరిగేషన్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సమ్మర్ ఆక్షన్ ప్లాన్ రూపొందించామని, ఎక్కడా త్రాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే త్రాగునీటి సమస్యల పరిష్కారం కోసం రూ.49 లక్షలు కేటాయించి టెండర్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి అద్దె బావులు, ట్యాంకర్ల ద్వారా కూడా నీటి సరఫరా చేపడతామని పేర్కొన్నారు. అమృత్-2 పథకం కింద పైప్‌లైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, విలీన గ్రామాల డివిజన్లకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రభుత్వం వద్ద నివేదికలు సమర్పిస్తామని మేయర్ తెలిపారు. నగర వ్యాప్తంగా లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయాలని, లేబర్ కొరతను కూడా త్వరలో తీర్చుతామని చెప్పారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ సమ్మర్ ఆక్షన్ ప్రణాళిక అమలులో మేయర్‌తో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫిల్టర్ బెడ్‌లలో మరమ్మతులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం మూడు ఫిల్టర్ బెడ్‌లు వినియోగంలో ఉన్నాయని చెప్పారు. మరో 10 ఎంఎల్‌డీ ఫిల్టర్ బెడ్ పునరుద్ధరణ పనులు అమృత్ పథకం కింద కొనసాగుతున్నాయని, మార్చి నెలలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. మానేరు డ్యాం నీటి మట్టం తగ్గడంతో ప్రస్తుతం రోజువారీ సరఫరా బదులుగా ప్రత్యామ్నాయ సరఫరా విధానాన్ని అమలు చేస్తున్నామని, త్వరలో నాలుగు బూస్టర్ పంపులను ప్రారంభించి నీటి శుద్ధీకరణ కేంద్రానికి నీటి సరఫరా పెంచుతామని పేర్కొన్నారు. నగర ప్రజలు నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాసం గణేష్, డీఈ దేవేందర్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.





# వైభవంగా సాగుతున్న యాదాద్రి బ్రహ్మోత్సవాలు

## గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చిన నారసింహుడు

యాదగిరిగుట్ట,ఫిబ్రవరి23 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన సోమవారం యాదగిరీశుడిని 'గోవర్ధనగిరిధారి' అలంకరణలో భక్తులు సేవించారు. భక్తజన రక్షణే ధ్యేయంగా అవతారాలు దాల్చిన స్వామివారు ప్రకృతి బీభత్సం నుంచి కాపాడే భక్తజన బాంధవుడిగా శ్రీకృష్ణుడి లీలలను ప్రతిబింబించే అలంకరణలో దివ్య మనోహరంగా భక్తజనులకు దర్శనమిచ్చారు. తన చిటికెన వేలుతో గోవర్ధన పర్వతాన్ని ఎత్తిపట్టి గోపాలులను రక్షించిన మహిమలను అర్చకులు అలంకార విశిష్టతను భక్తులకు వివరించారు. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య వైభవంగా ఊరేగించారు. ఉత్సవాలను ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు, అర్చక బృందం, వేదపడింతులు, రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారు సింహ వాహనం పై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నర్సింహమూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో దోర్భల భాస్కరశర్మ, ఏఈవోలు, పర్యవేక్షకులు, ఉద్యోగ, సిబ్బంది, భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

# రాష్ట్ర పోలీస్ క్రీడల్లో కరీంనగర్ కమిషనరేట్ సత్తా



కరీంనగర్, జనతా న్యూస్: సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా ఇటీవల నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర నాల్గవ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కరీంనగర్ కమిషనరేట్ పోలీస్ సిబ్బంది విశేష ప్రతిభ కనబరిచి 35 పతకాలను కైవసం చేసుకున్నారు. వివిధ క్రీడా విభాగాల్లో పోటీ పడిన అధికారులు, సిబ్బంది మొత్తం 9 స్వర్ణ, 13 రజత, 13 కాంస్య పతకాలు సాధించడం విశేషం. ఏసీపీ మాధవి టేబుల్ టెన్నిస్‌లో రెండు స్వర్ణాలు, బాడ్మింటన్‌లో రజతం, యోగాలో కాంస్య పతకం సాధించారు. ఇన్‌స్పెక్టర్ జి. రవి కిరణ్ 45 ప్లస్ బాడ్మింటన్‌లో కాంస్య, సింగిల్ షటిల్‌లో రజత పతకాలు గెలుచుకున్నారు. పీసీ ఎ. స్వప్న ఆర్మ్ రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్ డబుల్స్, టీమ్ విభాగాల్లో మూడు స్వర్ణాలు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. పీసీ ఎల్. శ్రీజ టేబుల్ టెన్నిస్ డబుల్స్, టీమ్ విభాగాల్లో రెండు స్వర్ణాలు, సింగిల్స్‌లో రజత పతకం అందుకున్నారు. పీసీ శ్రీధర్ ఈత పోటీల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించగా, పీసీ జె. సాయి దీప్ వాటర్ స్పోర్ట్స్‌లో ఒక స్వర్ణం, ఒక కాంస్యం గెలిచారు. పీసీ ఎండి సోహైల్ రెజ్లింగ్‌లో కాంస్య పతకం, పీసీ ఎం. అరుణ పవర్ లిఫ్టింగ్‌లో రజతం, కబడ్డీలో గౌతమి ప్రసన్న, జయ కాంస్యాలు సాధించారు. యోగాలో డి. బాలకృష్ణ, ఎ. శంకర్ చెరో రెండు రజత పతకాలు గెలుచుకున్నారు. జూడోలో ఎండి సల్మాన్ అలీ కాంస్య పతకం సాధించగా, హెచ్‌సీ మల్లేష్ 45 ప్లస్ బాడ్మింటన్‌లో కాంస్యం అందుకున్నారు. డిస్కస్ త్రోలో డి. రాజు రజతం, ఆర్మ్ పవర్ లిఫ్టింగ్‌లో వై. రవి కుమార్ రజతం, బాడీ బిల్డింగ్‌లో ఆర్‌ఎస్‌ఐ కె. గణేష్ రజతం, హ్యామర్ త్రోలో ఎ. తిరుపతి రజతం సాధించారు. ఏఎస్‌ఐ పి. ఉమారాణి టేబుల్ టెన్నిస్‌లో ఒక కాంస్యం, షటిల్‌లో మూడు కాంస్య పతకాలు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం క్రీడాకారులను అభినందిస్తూ విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలకమని, జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ విజయాలు పోలీస్ శాఖలోని ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తాయని ఆయన పేర్కొన్నారు.

# మార్చి 1 నుంచి 7 వరకు సంసద్ ఖేల్ మహోత్సవ్ క్రీడా పోటీలు



కరీంనగర్, జనతా న్యూస్: సంసద్ ఖేల్ మహోత్సవ్ పేరిట క్రీడా పోటీలు మార్చి 1 నుండి 7 వరకు నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో సోమవారం జరిగిన నిర్వహణ ఏర్పాట్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వివరాలు వెల్లడించారు. పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మార్చి 1 నుండి 3 వరకు ప్రాథమిక స్థాయి పోటీలు నిర్వహించగా, గెలుపొందిన జట్లకు మార్చి 5, 6, 7 తేదీల్లో కరీంనగర్ ప్రధాన కేంద్రంలో తుదిపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఈ క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా తీర్చిదిద్దాలన్న దృష్టితో ఖేల్ మహోత్సవ్ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారని, ఆ దిశగా ప్రతి ఏటా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా కబడ్డీ, కోకో, వాలీబాల్, హాకీతో పాటు అథ్లెటిక్స్ విభాగాల్లో 100, 400 మీటర్ల పరుగు, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావెలిన్, డిస్కస్ త్రో వంటి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఈ నెల 25 నుండి 27 వరకు అసెంబ్లీ వారీగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పోటీలను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్, కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీతో పాటు వివిధ నియోజకవర్గాల ముఖ్య నేతలు, కార్పొరేటర్లు, ఇన్చార్జులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహణ

## భావి శాస్త్రవేత్తలుగా విద్యార్థులు ఎదగాలి: అడిషనల్ కలెక్టర్ పిలుపు



కరీంనగర్, జనతా న్యూస్: జాతీయ సైన్స్ దినోత్సవం (ఫిబ్రవరి 28)ను పురస్కరించుకుని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం లక్ష్యంగా జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు అమిరిశెట్టి దామోదర్, ప్రధాన కార్యదర్శి వి. రాంకిరణ్ మరియు కార్యవర్గం ఆధ్వర్యంలో జిల్లా సైన్స్ మ్యూజియంలో ఈ పరీక్ష జరిగింది. జిల్లాలోని 16 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న మండల టాపర్స్‌గా ఎంపికైన విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతో పాటు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను నిజ జీవితంతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని శాస్త్రవేత్తల కృషిని ఆదర్శంగా తీసుకోవాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక రంగాల్లో నైపుణ్యం సాధించి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో భౌతిక, రసాయన, జీవ శాస్త్రాలకు సంబంధించిన అంశాలపై చర్చించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు జిల్లా సైన్స్ మ్యూజియాన్ని సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని సీల్డ్ కవర్‌లో ఆవిష్కరించారు. 16 మండలాల నుంచి ఎంపికైన విజేతలకు మెమెంటోలు అందజేశారు. కరీంనగర్ మండలం నుంచి కనపర్తి సుశాంత్ (జెడ్‌పిహెచ్‌ఎస్ జంగపల్లి) ప్రథమ స్థానం, భూమ్పల్లి కీర్తి (జెడ్‌పిహెచ్‌ఎస్ జంగపల్లి) ద్వితీయ స్థానం, కోమటిరెడ్డి ఆదిత్య (టీజీఎంఎస్ ఎలగందల్) తృతీయ స్థానం సాధించారు. రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో వీరు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ మిలకూరి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ బాధ్యులు నాగుల భుజన్ చందర్, నలుమాచు చంద్రశేఖర్, కామిరెడ్డి రామేశ్వర్ రెడ్డి, గైడ్ టీచర్లు గోరంటల ఆనందం, ఎం.డి. మునీరొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తల అరెస్టు అన్యాయం: బీఆర్ఎస్ నేత మల్లికార్జున రెడ్డి

హుస్నాబాద్,జనత న్యూస్: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి తరలివెళ్తున్న హుస్నాబాద్ మండల ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. సోమవారం హుస్నాబాద్‌లో అరెస్టయిన ఆశా కార్యకర్తలకు బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి స్వయంగా కలిసి సంఘీభావం ప్రకటించారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.గ్రామాల్లో, పట్టణ వార్డుల్లో తమ ఇల్లు, పిల్లలను వదిలిపెట్టి ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం కనీస కనికరం లేకుండా వ్యవహరిస్తోందని మల్లికార్జున రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత 15 ఏళ్లుగా అతి తక్కువ పారితోషికంతో పని చేస్తున్న వీరికి, ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర ధరల దృష్ట్యా తమ కుటుంబాన్ని పోషించడం, పిల్లలను ఉన్నత చదువులు చదివించడం భారంగా మారిందని పేర్కొన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం గళమెత్తిన వారిని పోలీసుల ద్వారా అరెస్టు చేయించడం, భయభ్రాంతులకు గురిచేయడం అన్యాయమని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల పోరాటానికి ప్రత్యక్షంగా మద్దతు తెలిపి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ముందస్తు అరెస్టు అయిన వారిలో ఆశా కార్యకర్తలు తగరపు భాగ్యలక్ష్మి, వర్ష, శోభారాణి, గడిపె అనసూయ, దప్పుట జ్యోతి, ఆకారపు కోమల, పున్న అనిత, పచ్చమట్ల స్వరూప, గడిపె రజిత, మల్లిక, లలిత తదితరులు ఉన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com